క్లుప్తంగా

37వ రోజుకు 'జిల్లా' దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 37వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం ఈ దీక్షల్లో న్యాయవాదులు కూర్చున్నారు. దీక్షలను విద్యార్థి జేఏసీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

మొక్కల పరిశీలన



ఎడపల్లి(బోధన్): జానకంపేట్‌లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు సరిగ్గా పెరగక పోవడంతో వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటినట్లు ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం జానకంపేట రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో ఉన్న పశువులు వాటిని పాడుచేస్తున్నాయని వాటి నుంచి మొక్కలను కాపాడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీపై ఉందన్నారు. పశువులు తిరిగే సమయంలో మొక్కలకు రక్షణగా వన సేవకులను ఉంచాలని గ్రామ పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యదర్శి ప్రేమ్ దాస్ పాల్గొన్నారు.

గదుల నిర్మాణానికి భూమిపూజ

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.6 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టే తరగతి గదుల నిర్మాణానికి సర్పంచ్ అశోక్ మంగళవారం భూమిపూజ చేశారు. అలాగే రూ.4 లక్షలతో చేపట్టే ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వీడీసీ అధ్యక్షుడు ముఖేష్, హెచ్ఎం చంద్రమోహన్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



బాల్కొండ: మండల కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ వినోద్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న కల్యాణమండపం, రెండో వైకుంఠ ధామం, సంఘ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ రాజ్ డీఈఈ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వాహబ్ పాల్గొన్నారు.

దశమ వార్షికోత్సవం



కోటగిరి: మండల కేంద్రంలో మీర్జాపూర్ వీధిలోని రామాలయంలో మంగళవారం దశమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో ఎంపీపీ వల్లేపల్లి సునీత శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూర్ కిశోర్, సభ్యులు హన్మంత్ రావు, సుధాకర్, రమణ, డీవీకే ప్రసాద్ రావు, కొల్లూర్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా పోటీలు



బోధన్‌టౌన్(బోధన్): గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు కబడ్డీ, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఇతర పోటీలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం వంజరి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వంజరి సంఘం నాయకులు నవాతే గంగాధర్, కాపుకార్ భూమేశ్వర్, నవాతే శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, అమంద్ సంజీవ్, నారాయణ, చిన్న గంగారం, రవీందర్, యోగేష్, జీవన్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో మార్కండేయ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కొన్నిచోట్ల శోభాయాత్రలు చేసి అన్నదానాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ముప్కాల్‌లో భక్త మార్కండేయ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వేల్పూర్ పద్మశాలి సంఘంలో వేడుకలు



ఆర్మూర్ మార్కండేయ మందిరంలో యజ్ఞం..



కిసాన్‌నగర్‌లో..



కమ్మర్‌పల్లిలో ..



గుమ్మిర్యాల్‌లో ..



రుద్రూర్‌లో ..



బోధన్ పట్టణం రాకాసిపేట్ కాలనీలో..



నవీపేటలో..

ఏసీడీ చార్జీలతో ప్రజలపై అదనపు భారం



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం ఏసీడీతో పేరుతో అదనపు చార్జీలు వేయడం వల్ల ప్రజలపై భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా తర్వాత ప్రజలు ఆర్థిక భారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఒక నెల బిల్లు కట్టకపోతే కట్ చేస్తున్నారే తప్ప ఎలాంటి నోటీసు, సమాచారం ఇవ్వకుండా అధిక బిల్లులు వసూలు చేయటం పాలకులకు తగదని పేర్కొన్నారు. సీపీఎం ఆర్మూర్ ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఏరియా కమిటీ సభ్యులు తాటి భూమన్న, నాగరాజు పాల్గొన్నారు.



కోటగిరిలో ధర్నా చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

పేదల ఉసురు తీస్తోంది

కోటగిరి: ఏసీడీ చార్జీల నెపంతో ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజల ఉసురు తీస్తోందని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. చార్జీలకు వ్యతిరేకంగా కోటగిరి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ సామాన్యులు అనునిత్యం వాడే వస్తువులు, విద్యుత్ లాంటి వాటిపై ట్యాక్సులు విధిస్తూ, పేదల నెత్తిన భారాలను మోపడం అన్యాయం అన్నారు. ప్రతినెలా ఇంధన సర్ చార్జీలను పెంచుకోవడానికి డిస్కంలకు స్వేచ్ఛ కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ఏసీడీ చార్జీలను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఉపవిద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని ఇన్‌చార్జి ఎంఈవో నాగనాథ్ అన్నారు. మంగళవారం 8 వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి 25న నిజామాబాద్‌లోని నూతన కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. నోడల్ అధికారి నాగయ్య, సీఆర్పీలు విజయ్, యూసుఫుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్టీ థామస్ కళాశాలలో..

బోధన్‌టౌన్(బోధన్): జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఎస్టీ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

థామస్ డీఈడీ, బీఈడీ కళాశాలలో అధ్యాపకులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ రోడే మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగాలని, సావిత్రిబాయి పూలే, మదర్ థెరిసా, ద్రౌపది ముర్ములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

పసుపు రైతులకు స్వల్ప ఊరట

- క్వింటాల్‌కు రూ.6500 పలికిన ధర
- ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం

బాల్కొండ: పసుపు పంట సాగు చేసి మార్కెట్‌కు తరలించిన రైతుకు మంగళవారం మార్కెట్‌లో స్వల్ప ఊరట లభించింది. మంగళవారం మార్కెట్‌లో కొమ్ముకు క్వింటాల్‌కు రూ.6500, దుంపలకు రూ.6 వేల ధర పలికింది. 20 రోజుల క్రితం ప్రస్తుత సంవత్సరం సీజన్ ప్రారంభమైంది. కాని ఇన్నాళ్లు ధర రూ.5800 వరకే గరిష్ఠంగా పలికింది. ప్రస్తుత సీజన్‌లో ఇదే అధిక ధర అని రైతులు అంటున్నారు. గతేడాది చివరిలో క్వింటాల్‌కు



మార్కెట్‌కు తరలించటానికి సిద్ధం చేసిన పసుపు

రూ.8500 వరకు గరిష్ఠంగా పలికింది. ప్రస్తుత సంవత్సరం కూడా అంత కంటే ఎక్కువ ధర పలుకుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం లబ్ధిదారులకు స్థానిక ప్రజా ప్రతినిధులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బార్ల చిన్నుబాయి, మార్ల చిన్న గంగారం, గూండ్ల పడిగెల గంగారం, లక్ష్మీ, గోసం గంగాధర్, బంజ బక్కన్న ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆస్పత్రి వ్యయాలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా



మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కులను ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లెం భోజా రెడ్డి, వైస్ ఎంపీపీ మోతె భోజకళ పాల్గొన్నారు.

కొండూరు లిఫ్ట్ కార్యవర్గం ఎన్నిక



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సీహెచ్ కొండూరు ఎత్తిపోతల పథకం కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఉప్పరి ఓంకార్, వైస్ చైర్మన్‌గా కొండూరు భూమేషలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాదాపు 1000 ఎకరాల ఆయకట్టు గల ఈ ప్రాజెక్టుకు పాలకవర్గ సభ్యులు ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నిక నిర్వహిస్తారని ఎన్నికల అధికారి పాపయ్య, సొసైటీ ఇన్‌చార్జి శంకర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు రాముడు, పోశెట్టి, బ్రహ్మన్న, ప్రభాకర్, ఎంపీటీసీలు ధాత్రిక రాజు, మనోజ్‌రావు, ఉప సర్పంచ్ మంగి సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం అమలు చేయండి



కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కమ్మర్‌పల్లి తహసీల్దార్‌కు ఈమేరకు నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులు వ్యవసాయంలో అధిక యాంత్రీకరణ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది ఉపాధి లేక విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మిగిలిపోయిన భూములను కార్మికులకు పంచాలని కోరారు. నాయకులు అశోక్, బాలయ్య, సత్తెక్క, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ అర్వింద్ నీ భాష మార్చుకో'



మోర్తాడ్: ఎంపీ అర్వింద్ మాట్లాడే పద్ధతి, భాషను మార్చుకోవాలని ఏర్గట్ల బీఆర్ఎస్ నేతలు సూచించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎంపీగా గెలిచి ఏమీ చేయలేని మీరు ఎంతో చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఎక్కువగా ఏర్గట్ల మండల ప్రజలకే లబ్ధి చేకూరిందని, చిన్న మండలమైనా ఎన్నో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీ పద్ధతి మార్చుకోకుంటే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

వైభవంగా గణపతి హోమం

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లోని శుక్రవారం దేవీ ఆలయం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి హోమం, మహాలక్ష్మి యాగం, తదితర కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు.



కార్యక్రమంలో పోలీస్ విద్యాసాగర్ లావణ్య దంపతులు, బక్కన్న, రమేష్, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పాస్ విధానంలో ఎరువులు విక్రయించండి



వేల్పూర్‌లో డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మల్లయ్య



రెంజల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేల్పూర్ : ఎరువులు, విత్తనాలను డీలర్లు ఈ–పాస్ విధానంలో విక్రయించాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య పేర్కొన్నారు. వేల్పూర్ రైతు వేదికలో మంగళవారం భీమ్‌గల్ డివిజన్ పరిధిలోని బాల్కొండ నియోజకవర్గ డీలర్లకు ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓఎల్ఎంఎస్) విధానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డీలర్లు తప్పనిసరిగా నూతన సాఫ్ట్‌వేర్ విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలని సూచించారు. కొత్తగా ఎరువుల లైసెన్సు పొందాలంటే ప్రతి దరఖాస్తుదారుడు విధిగా బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లమా అగ్రికల్చర్, మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ కోర్సు, కేవీకే ట్రైనింగ్ కోర్సు సర్టిఫికెట్ కలిగి ఉండాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు నర్సయ్య, మహేందర్, లావణ్య, సాయికృష్ణ, రాజ్‌కుమార్, మాలిక్, ఏఈవోలు తిరుమల, స్నేహ, ప్రశాంత్, డీలర్లు పాల్గొన్నారు.

రెంజల్ పరిధిలో..

రెంజల్(బోధన్) : ఓఎల్ఎంఎస్‌పై వ్యవసాయ శాఖ అధికారులకు సాటాపూర్ రైతు వేదికలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెంజల్, ఎడపల్లి, బోధన్, నవీపేట్ మండలాలకు చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించి ఎరువులు, దుకాణ లైసెన్స్ తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకుడు సంతోష్, రెంజల్, ఎడపల్లి వ్యవసాయాధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సిద్ధి రామేశ్వర్, ఏఈవోలు అజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్

మాక్లూర్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2 వేలు పెంచుతున్నట్లు అసెంబ్లీలో ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీని నెరవేర్చి మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కొండ గంగాధర్, పద్మారావు, సాయమ్మ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రమోషన్ల షెడ్యూల్ విడుదలపై హర్షం

కోటగిరి: కోటగిరి, పొతంగల్ ఉభయ మండలాల్లోని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల సమావేశాలు మంగళవారం జరిగాయి. పోతంగల్ మండల సమావేశం సూదం వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లపై షెడ్యూలు, అలాగే డీఏ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 317 జీవో నేపథ్యంలో బదిలీ జరగని టీచర్లను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి వారిని సొంత జిల్లాకు వెళ్లే విధంగా, అలాగే భాగస్వామి ఉపాధ్యాయుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని, పండిత్, పీఈటీల అప్‌గ్రెడేషన్, ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరగా పరిష్కరించాలని, మిగతా మూడు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



కోటగిరిలో మాట్లాడుతున్న అధ్యక్షుడు గంగరాజు

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

రెంజల్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 3 పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డు అధికారుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సుదర్శన్‌రాజ్ మంగళవారం డిమాండ్ చేశారు. పీఆర్సీ ఏర్పాటు చేసి జూన్ వరకు నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆత్మరక్షణ కోసం శిక్షణ తీసుకోండి

పెర్కిట్(ఆర్మూర్): బాలికలు విద్యతో పాటు ఆత్మరక్షణ కోసం శిక్షణ తీసుకోవాలని చేపూర్ సర్పంచ్ ఇందూర్ సాయన్న సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ సాయన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోకిరీల నుంచి తమని తాము కాపాడుకోవడానికి ఆత్మరక్షణ విద్యలు తోడ్పడతాయన్నారు. అనంతరం తైక్వాండో మాస్టర్ భోజన్న విద్యార్థినులకు కరాటేలో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాధవ రెడ్డి, వీడీసీ చైర్మన్ సంజీవ్ పాల్గొన్నారు.



చేపూర్‌లో శిక్షణనిస్తున్న కరాటే మాస్టర్ భోజన్న

నవీపేటలో..

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థినులకు కరాటేపై శిక్షణ ఇచ్చారు. స్వీయ రక్షణలో మెలకువలు నేర్పించారు. ఎంఈవో గణేష్‌రావ్, కేజీబీవీ ప్రత్యేక ఆఫీసర్ రమా, కరాటే శిక్షకులు షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



ఆర్మూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అయేషా



వర్నిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు తమ కంటి పరీక్షలు చేయించుకోవాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అయేషా అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 33,1,4వ వార్డులలో కంటి వైద్య శిబిరం ముగిసిందని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి రీడింగ్ అద్దాలు, అవసరమైన వారికి ఆర్డర్‌పై అద్దాలు అందిస్తున్నామన్నారు. పట్టణంలో బుధవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమం 36వ వార్డులో బోట్ల జీవన్ ఇంటివద్ద, 2వ వార్డులో గంగపుత్ర సంఘం, 5వ వార్డులలో నిర్వహిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తెలిపారు.

మోస్రాలో కంటి శిబిరం పరిశీలన

రుద్రూర్: మోస్రాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం తహసీల్దార్ సాయిలు సందర్శించారు. శిబిరంలో ఏర్పాట్లు పరిశీలించారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మంగళవారం 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఎస్సై రవీందర్ వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు.

వర్నిలో..

వర్ని: తగిలేపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ఐదు రోజుల్లో శిబిరంలో ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, ఎంతమందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు, ఎవరెవరికి ఆపరేషన్ నిమిత్తం జిల్లా ఆసుపత్రికి సిఫారసు చేశారు అన్న విషయాన్ని ఆయన వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. 620 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 93 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెల్లడించారు.